కొనుగోళ్లకు ఎదురుచూపులు..!

- గ్రామీణ ప్రాంతాల్లో మొదలైన పత్తితీత పనులు
- రంగంలోకి దిగిన ప్రైవేట్ వ్యాపారులు, దళారులు
- బెల్లంపల్లిలో నిరుపయోగంగా వ్యవసాయ మార్కెట్ యార్డు
- ఇప్పటికీ ప్రారంభంకాని సీసీఐ కొనుగోలు కేంద్రాలు
- ఆలస్యం చేస్తే అన్నదాతలు నష్టపోయే ప్రమాదం


రేపల్లెవాడ శివారులోని ప్రైవేట్ జిన్నింగ్ మిల్లు (ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో పత్తి సేకరణ పనులు ప్రారంభమయ్యాయి. మరో వారంరోజుల వ్యవధిలో పత్తి సేకరణ పనులు మరింతగా ముమ్మరమయ్యే అవకాశాలు కనిపిస్తుండగా, సేకరిస్తున్న పత్తిని అమ్ముకోవడానికి రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఓ వైపు పత్తి సేకరణ జరుగుతుండగా, మరో వైపు పల్లెల్లో ప్రైవేట్ వ్యాపారులు, దళారులు రంగ ప్రవేశం చేస్తున్నారు. రైతాంగానికి నగదు ఆశజూపి పత్తి కొనుగోళ్లకు బేరం పెడుతున్నారు. మిత్తికి అప్పు తెచ్చి పంట సాగు చేసిన రైతులు, అయిన కాడికి అమ్ముకోవడానికి సిద్ధపడుతున్నారు. మద్దతు ధర దక్కకపోయినప్పటికీ అప్పుకు వడ్డీ పెరగకుండా పత్తిని అమ్ముకోవడమే ఏకైక మార్గంగా భావిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులే దిక్కవుతున్నారు. మార్కెట్ కమిటీ అధికారుల నిర్లక్ష్యంతో రైతుల రెక్కల కష్టం వ్యాపారుల పరంకానుందనే విమర్శలు వస్తున్నాయి.

కొనుగోళ్లకు మల్లగుల్లాలు...

బెల్లంపల్లి కేంద్రంగా వ్యవసాయ మార్కెట్ యార్డు ఉన్నా రైతులకు ఏమాత్రం ఉపయోగపడటం లేదు. మార్కెట్ యార్డు ఏర్పాటైనప్పటి నుంచి ఇంతవరకు ఏ ఒక్కసారి కూడా పత్తి కొనుగోళ్లు చేపట్టలేదు. అందుబాటులో జిన్నింగ్ మిల్లులు లేవనే సాకుతో బెల్లంపల్లికి 10కిలో మీటర్ల దూరం రేపల్లె వాడ శివారులో ఉన్న ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లో క్రయ విక్రయాలు చేస్తున్నారు. తద్వారా రైతులకు రవాణా చార్జీలు భారమవుతున్నాయి. అసలే గిట్టుబాటు ధర కల్పించని అధికారులు, ఆ పై పత్తిని అమ్మకానికి తీసుకురావడానికి ట్రాక్టర్లు, ట్రాలీలు ఇతర వాహనాలకు అధిక చార్జీ చెల్లించుకోవాల్సిన పరిస్థితులు ఉంటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా మాదిరిగానే ఈ సారి కూడా ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లో పత్తి క్రయవిక్రయాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి గ్రామాల్లో సంసిద్ధమవుతున్నారు. పత్తి సేకరణతోనే అమ్మకం, కొనుగోళ్లు జరగాల్సి ఉండగా మార్కెట్ కమిటీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కాగా ఆయా ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లో ఎలక్ట్రానిక్ కాంటాలు ఇతరత్ర యంత్రాల మరమ్మతు పనులు ఈ పాటికే పూర్తి చేసినట్లు తెలుస్తోంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)ద్వారా పత్తి కొనుగోళ్లు జరపడానికి చర్యలు తీసుకుంటున్నారు.

మద్దతు ధర దక్కేనా...?

ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి పత్తిసాగు చేస్తున్న రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. ఏటా ఎరువులు, విత్తనాలు క్రిమిసంహారక మందులు, కూలీల ఖర్చు, రవాణా చార్జీల ధరలు పైపైకి ఎగబాకుతుండగా, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన తెల్లబంగారానికి కనీస మద్దతు ధర దక్కడం లేదనే వేదన రైతాంగంలో ఉంది. గతేడాది కంటే ఈసారి క్వింటాల్ పత్తికి కేవలం రూ.500ధర పెంచడం గమనార్హం. పెంచిన ధర రైతాంగానికి ఏమాత్రం గిట్టుబాటు కానీ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడలు, తెగుళ్లు, వన్యప్రాణుల నుంచి అష్టకష్టాలు పడి పత్తి పంట పండించిన రైతులకు ప్రయోజనం లేకుండా పోతోంది.

అసెంబ్లీ నియోజకవర్గంలో సాగైన పత్తి పంట (ఎకరాల్లో)	
వ్యవసాయ డివిజన్	సాగు చేసిన పత్తిపంట
బెల్లంపల్లి	33,000
భీమిని	50,000
మొత్తం	83,000

ప్రభుత్వం ప్రకటించిన పత్తి మద్దతు ధర	
ప్రస్తుత ఏడాది క్వింటాల్ పత్తి ధర	రూ.7,521
గతేడాది చెల్లించిన మద్దతు ధర	రూ.7,020

మార్కెట్ కమిటీకి వచ్చిన ఆదాయం		
సంవత్సరం	టార్గెట్	వచ్చిన ఆదాయం (రూ.కోట్లలో)
2020–21	1.06	107.71
2021–22	253.57	262.77
2022–23	261.10	224.88
2023–24	259.24	360.43

నవంబర్ 11న ప్రారంభించే అవకాశం

పత్తి పంట కొనుగోళ్లను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ సారి నవంబర్ 11న ప్రారంభించే అవకాశాలున్నాయి. స్థానిక ఎమ్మెల్యేను రప్పించి కొనుగోళ్లను చేపట్టాలనే తలంపులో యత్నాలు చేస్తున్నాం. అంతకు ముందే ప్రైవేట్ జిన్నింగ్‌మిల్లుల్లో ఎలాంటి ఆటంకాలు కలగకుండా మరమ్మతు పనులు చేపట్టారు. పత్తిని కొనుగోలు చేయడానికి సీసీఐ అధికారులు సిద్ధంగా ఉన్నారు.

– భాస్కర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి, బెల్లంపల్లి

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

చెన్నూర్: నియోజకవర్గంలోని చెన్నూర్, మందమర్రి మున్సిపాలిటీలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి గురువారం పర్యటించనున్నారు. గురువారం ఉదయం 9:30గంటలకు చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతన అంబులెన్స్‌ను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ప్రారంభిస్తారు. 11:30గంటలకు మందమర్రి ఓవర్ బ్రిడ్జ్ పై నిర్మించిన సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించనున్నారు. కార్యక్రమాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: సెప్టిక్ ట్యాంకు గ్యాస్ పైపులైన్ వేసి దుర్వాసన రావడానికి కారణమైన అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లికి చెందిన ముస్లిం నాయకులు అధికారులను కోరారు. కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్, సీడీపీవో కార్యాలయాల్లో బుధవారం వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వ అధికారులు వెంటనే విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు మహబూబ్‌ఖాన్, అమానుల్లాఖాన్, అన్వర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

స్మారక సభలు విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న లాల్‌కుమార్

పాతమంచిర్యాల: అమరవీరులను స్మరిస్తూ నవంబర్ 1 నుంచి 9వరకు నిర్వహించే స్మారక సభలను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఏ.లాల్‌కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్‌భవన్‌లో బుధవారం మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు జాఫర్, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, జిల్లా ప్రధాన కార్యదర్శి దారిశెట్టి అరుణ, ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దొండ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడిగా పదోన్నతి

దండేపల్లి: రెండో అన్నవరంగా ప్రసిద్ధి పొందిన దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో 22ఏళ్లుగా పరిచారకుడిగా విధులు నిర్వర్తిస్తున్న సురేందర్‌కు అర్చకుడిగా పదోన్నతి లభించింది. ఈ మేరకు దేవదర్మాదాయ శాఖ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పత్రాన్ని ఆలయ ఈవో శ్రీనివాస్ సురేందర్‌కు అందజేశారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

చెన్నూర్: లక్సెట్టిపేటలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో చెన్నూర్ మహాత్మా జ్యోతిభా పూలే పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కేపీఎం ప్రకాశ్ రావు తెలిపారు.

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు సన్నీత్, వంశీకృష్ణ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక

జన్నారం: ఈ నెల 29న మంచిర్యాలలో జరిగిన జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొన్న మండలంలోని ఇందన్‌పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం రాజేందర్, పీడీ తిరుపతి బుధవారం తెలిపారు.

కౌన్సిల్ సమావేశానికి అధికారులు డుమ్మా

- మిషన్ భగీరథ మరమ్మతు పనుల్లో ఏఈ నిర్లక్ష్యం
- సమావేశంలో సమస్యలేవనెత్తినా పరిష్కరించని అధికారులు


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అర్చన రాంలాల్‌గిల్డా

చెన్నూర్: మున్సిపల్ సాధారణ సమావేశానికి అధికారులు డుమ్మా కొట్టడంపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన రాంలాల్ గిల్డా అధ్యక్షతన బుధవారం సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఏఈతో పాటు టౌన్ ప్లానింగ్, అకౌంటెంట్‌లు గైర్హాజరయ్యారని వారిపై చర్యలు తీసుకోవాలని ఏడో వార్డు కౌన్సిలర్ జగన్నాథుల శ్రీనివాస్ అధికారులను కోరారు. మిషన్ భగీరథ పైపులైన్లు లీకేజీ అవుతున్నాయని ప్రతి సమావేశంలో చెప్పినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని 16, 8వ వార్డు కౌన్సిలర్లు తుమ్మ రమేశ్, జోడు శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కమిటీల్లో కౌన్సిలర్ల భాగస్వామ్యం ఉండాలని పాలకవర్గ సభ్యులు కమిషనర్‌ను కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కమిటీలు వేయడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. గతంలో వార్డుకు రూ.30వేల చొప్పున కేటాయించినా, డబ్బుల విడుదలలో జాప్యం చేస్తున్నారని వెంటనే బిల్లులు చేయాలని నాల్గో వార్డు కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ అధికారులను కోరారు. స్కిల్ డెవలంప్ మెంట్ కోసం మంజూరైన రూ. 8లక్షల నిధులతో పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని కమిషనర్ తెలిపారు. అనంతరం 18వార్డుల్లో చెడిపోయిన మోటార్ల రిపేర్లు, పారిశుధ్య నిర్వహణ కోసం వచ్చ ఆటోల కొనుగోలు కోసం ప్రతిపాదించిన తీర్మానాన్ని కౌన్సిలర్లు ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. తాగునీటికి ఇబ్బంది కాకుండా వార్డుల్లో చెడిపోయిన మోటార్లు, పైపులైన్ల లీకేజీలను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళికృష్ణ, వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు దీపావళి

మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో బుధవారం ముందస్తు దీపావళి నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం అలంకరించి బాణాసంచాలు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. అందరి జీవితాల్లో దీపావళి వెలుగులు నింపాలని ప్రిన్సిపాల్ జోబిన్ సూచించారు. ఏవో విలాస్, జోనల్ పీఈటీ రాజేందర్, డీన్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో బుధవారం ముందస్తు దీపావళి పండుగ జరుపుకున్నారు. ఉపాధ్యాయులు దీపావళి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. దీపాలంకరణ చేశారు.ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


దండేపల్లిలో...

కొనసాగుతున్న 'దండారీ'

కాసిపేట: మండలంలోని సోనాపూర్, దేవాపూర్, మద్దిమాడ, సాలెగూడ, గుళ్లపాడ్, తదితర ఆదివాసీ గ్రామాల్లో దండారీ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సంస్కృతి సంప్రదాయలతో ప్రత్యేక వేషధారణలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీపావళిని పురస్కరించుకొని గోండు తెగకు చెందిన ఆదివాసీలు, నాలుగు రోజులు వైభవంగా నిర్వహించే దండారీ ఉత్సవాలు ఆదివారం ప్రారంభించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి ఆరాధ్య దేవతకు ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు కోవ వినయ్, కోవ బారికరావు, కొడప ఈరు పటేల్, మెస్రం రంజిత్ కుమార్, కోవ పురుషోత్తం, సెడ్మెకి రాజు తదితరులున్నారు.


నృత్యం చేస్తున్న ఆదివాసీలు

ఆంక్షలు లేకుండా ప్లేడేలు ఇవ్వాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు సత్తయ్య


మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో పారా మెడికల్ సిబ్బందికి, హాస్పిటల్ కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్లేడేలు, పీహెచ్డీలు ఇవ్వాలని బీఎంఎస్ కేంద్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. నస్పూర్ కాలనీలోని ఆ యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా ఇటీవల జారీ చేసిన యస్–1 సర్క్యులర్‌ను యాజమాన్యం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, ఏరియా కార్యదర్శి రాగం రాజేందర్, నాయకులు శ్రీకాంత్, రామగిరి పురుషోత్తం, మంద కమలాకర్, మేకల స్వామి, జిల్లా తిరుపతి, కాంపల్లి తిరుపతి, మోతె ఓదెలు పాల్గొన్నారు.

నియర్ బై హాకీ పోటీలు


విజేతగా నిలిచిన మందమర్రి జట్టు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో బుధవారం డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో నియర్ బై హాకీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఏరియా స్టోర్స్ ఇంజనీర్ పైడీశ్వర్ క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. మందమర్రి, బెల్లంపల్లి జట్టులు పోటీలో పాల్గొనగా మందమర్రి జట్టు గెలుపొందింది.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఆ యూనియన్ నాయకులు ఘనంగా నిర్వహించా రు. ఏరియాలోని ఏఐటీయూసీ కార్యాలయంతో పాటు గనులు, డిపార్ట్‌మెంట్లపై ఏరియా నాయకులు, ఫిట్ కార్యదర్శులు ఆ యూనియన్ జెండాలను ఎగురవేశారు. కార్మికుల సమస్యల పరిష్కా రం కోసం ఏఐటీయూసీ కృషి చేస్తుందని ఏఐటీయూసీ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు.

జీఎం సంజీవరెడ్డికి ఘనంగా వీడ్కోలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎంగా సంజీవరెడ్డి రిటైర్డ్ కాగా ఆయనకు బుధవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏరియా అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. రిటైర్మెంట్ తర్వాత శేష జీవితం సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా, డీజీఎంలు అరవింద రావు, చిరంజీవులు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏజెంట్లు ఏవీ రెడ్డి, రాముడు, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, అధికారులు రాజేశ్వర్, దేవేందర్ రెడ్డి, కాంతారావు, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జీఎం సంజీవరెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం


జన్కాపూర్‌లో నేలవాలిన వరి

భీమిని/జన్నారం/బెల్లంపల్లిరూరల్: అకాల వర్షంతో చేతికొచ్చిన వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్, టేకులపల్లి, ఎల్లారం, చెర్లపల్లిలో, జన్నారం మండలంలోని కవ్వాల్, కామన్‌పల్లి, కలమడుగు, ధర్మారంలో, బెల్లంపల్లి మండలంలో బుధవారం ఈదురు గాలులతో వర్షం కురవగా వందల ఎకరాల్లో వరి పైరు నేలకొరిగింది. వ్యవసాయ అధికారులు దృష్టి సారించి పంట నష్టంపై అంచనా వేసి పరిహారం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రూ.11లక్షల మున్సిపల్ జనరల్ ఫండ్‌తో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్, ముఖరం చౌరస్తా వద్ద రూ.5లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, వార్డు కౌన్సిలర్లు,నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

'కూరగాయల మార్కెట్‌కు మల్లేశ్ పేరు పెట్టాలి'

బెల్లంపల్లి: బెల్లంపల్లి సమీకృత కూరగాయల మార్కెట్‌కు మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేశ్ పేరు పెట్టాలని సీపీఐ నాయకులు కోరారు. బెల్లంపల్లి ఆర్డీవో, ఏసీపీ, మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల్లో బుధవారం వినతిపత్రాలు అందజేశారు. ప్రత్యేక మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేసి దివంగత ప్రజా నాయకుడు గుండా మల్లేశ్ పేరును మార్కెట్‌కు పెడుతూ తీర్మానం చేయాలని, లేకపోతే పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో రాజమౌళి, చిప్పనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఏరియా ఆసుపత్రి సందర్శన

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రిని బుధవారం బెల్లంపల్లి ఏరియా సింగరేణి జీఎం శ్రీనివాసరావు సందర్శించారు. ఆసుపత్రికి వెళ్లి వార్డులను కలియతిరిగారు. రోగులకు కల్పిస్తున్న సేవలు, సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వార్డులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ఇన్‌పేషంట్లకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని జీఎం ఆదేశించారు. ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి ప్రతిపాదనలు చేయాలని, అధికారులకు సూచనలు చేశారు. జీఎం వెంట ఎస్ఓటు జీఎం కె.రాజమల్లు, పీవో నరేందర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మధుకుమార్, వైద్యసిబ్బంది ఉన్నారు.

వేలం రద్దు చేయాలి

తాండూర్: బొగ్గుబ్లాకులు సింగరేణి కంపెనీకి కేటాయించాలని సీపీఎం తాండూర్ మండల కార్యదర్శి దాగం రాజారాం అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సంతకాల సేకరణ చేశారు. బొగ్గుబ్లాక్‌ల కేటాయింపు కోసం కేంద్ర ప్రభుత్వం వేలం నిర్వహించడం సరికాదన్నారు. వేలంను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం శ్రేణులు వేల్పుల శంకర్, రాజేశం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'రెండు నెలల వేతనం, బోనస్ చెల్లించాలి'

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): రామకృష్ణాపూర్ ఓపెన్‌కాస్టు గనిలోని మట్టితీత పనులు చివరి దశలో ఉన్నందునా, విధులు నిర్వర్తించే ఒప్పంద కార్మికులకు రెండు నెలల వేతనంతో పాటు, దీపావళి బోనస్ చెల్లించాలని బుధవారం మహాలక్ష్మి కాంట్రాక్ట్ కార్యాలయం వద్ద కార్మికులు బైఠాయించారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ లోని ఆర్కే 6 గనిలో రిటైర్డ్ అయిన హెడ్‌ఓవర్‌మెన్ లక్ష్మీనారాయణను గని మేనేజర్ తిరుపతి, ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్, టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. కంపెనీ నుంచి చెల్లించే టెర్మినల్ బెనిఫిట్స్ పే ఆర్డర్‌కాపీని అందించారు. జీఎం కార్యాలయంలోని సివిల్ డిపార్టుమెంట్‌లో డెప్యూటీ సూపరింటెండెంట్‌గా పని చేసి రిటైర్డ్ అయిన రవీందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

సంక్షిప్త వార్తలు

డ్రైయినేజీ పనులు నిలిపివేయాలి

భీమారం: మండల కేంద్రంలోని ఇప్పల బొగుడ సమీపంలో అనుమతులు లేని వెంచర్‌లో ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న మురుగు కాలువల నిర్మాణ పనులను నిలిపివేయాలని బుధవారం కాంగ్రెస్ నాయకులు రాజు, విజయ్ పంచాయతీ అధికారి కృష్ణకు వినతిపత్రం అందజేశారు. చర్యలు చేపట్టకపోతే ఆందోళన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యార్థి సదస్సు, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎంవీ.పట్వర్ధన్ హాజరై మాట్లాడారు. గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపన్యాసకుడు సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

చెన్నూర్‌రూరల్: కొమ్మెరలో పశువులకు బుధవారం గాలికుంటు నివారణ టీకాలు వేశారు. రైతులకు జాగ్రత్తలు తెలియజేశారు.

బీఆర్ఎస్ సంబురాలు

చెన్నూర్: చెన్నూర్ అంబేద్కర్ చౌరస్తాలో రూ.18,500కోట్ల విద్యుత్ భారాన్ని ఆపడంలో విజయం సాధించినందుకు బీఆర్ఎస్ శ్రేణులు బాణా సంచాలు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు.

'అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలి'

నస్పూర్: సమాజంలోని ప్రతి ఒక్కరూ అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సీతారాంపల్లి బ్రాంచి మేనేజర్ నరసింహస్వామి సూచించారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సీతారాంపల్లి శాఖ వారి ఆధ్వర్యంలో ఆదిత్య హై స్కూల్‌లో విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

వేమనపల్లి/కాసిపేట/జైపూర్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలని అధికారులు సూచించారు. జైపూర్, కాసిపేట, వేమనపల్లి మండల కేంద్రాల్లో ఎన్యుమరేటర్లకు బుధవారం అధికారులు అవగాహన కల్పించారు. ఒక్కో ఎన్యుమరేటర్ 150ఇళ్ల సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు.

అనుమతులు తప్పనిసరి

భీమారం: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్వేత హెచ్చరించారు. అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతనే దుకాణాలు పెట్టాలని సూచించారు.

పౌర హక్కులపై అవగాహన

నెన్నెల/నస్పూర్: పౌర హక్కులకు భంగం కలిగించొద్దని అధికారులు సూచించారు. నెన్నెల మండలం నార్వాయిపేటలో, నస్పూర్ మండలం సింగాపూర్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. నెన్నెలలో ఆర్ఐ సులోచన, మాజీ సర్పంచ్ కున్సోతు నీలమ్మ, నస్పూర్‌లో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకటేశం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): పట్టణానికి చెందిన భగత్ సింగ్ కాలనీ నివాసి చేతి శ్యామ్ శైలజ దంపతుల రెండో కుమారుడు దుర్గా వరుణ్ (03) ఐదు రోజుల క్రితం వేడిగా ఉన్న సాంబార్‌లో పడగా, ఒళ్లంతా గాయాలయ్యాయి. మంచిర్యాల ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రామకృష్ణాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు వరుణ్‌ను పరామర్శించి, ఖర్చుల కోసం రూ.33వేలు సాయం అందజేశారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి సన్మానం

బెల్లంపల్లిరూరల్: మండలంలోని మాలగురిజాల గ్రామానికి చెందిన రత్నం శ్రీవాత్సవ ఇటీవల జరిగిన ఎంబీబీఎస్ అర్హత పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి జగిత్యాల జిల్లా వైద్య కళాశాలలో సీటు పొందాడు. ఈ మేరకు ఆయన, వారి తల్లిదండ్రులను నేతకాని మహార్ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు.

ఆదివాసీ ఉద్యోగులకు సన్మానం

జన్నారం: మండలంలోని అలీనగర్‌లో ఆదివాసీ ఉద్యోగులైన జగిత్యాల డిప్యూటీ కలెక్టర్ చిత్రుపటేల్, ఉపాధ్యాయుడు రాయసీడం శ్రీహరిలను బుధవారం ఆదివాసీ గిరిజనులు సన్మానించారు.

ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సన్మానం

పాతమంచిర్యాల: జిల్లా కోర్టు సముదాయంలోని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు(పోక్సో) ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు చేపట్టిన ఏ.రాం భావ్‌ను బుధవారం సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ సభ్యులు బార్ అసోసియేషన్ మందిరంలో సన్మానించారు. సుభాష్ చంద్ర బోస్ చిత్రపటాన్ని బహూకరించారు.

వినతిపత్రం అందజేత

జన్నారం: నేతకాని కులస్తులను డీ గ్రూపులో చేర్చి 5శాతం రిజర్వేషన్ కల్పించాలని నేతకాని మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత కోరారు. ఏకసభ్య కమిషన్, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి షమీమ్ అత్తర్‌కు బుధవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం ఇచ్చారు.